క్లుప్తంగా

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



జ్ఞాన ప్రబోధం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక పల్లిపేట రోడ్డులో గడిచిన 8 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారంతో ముగిశాయి. నిత్య పూజా కార్యక్రమాలు చేస్తూ జ్ఞానరీత్యా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధి శ్రీనివాస్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

శిల్ప సంపదను కాపాడండి



మాన్యుమెంట్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

జలుమూరు: పవిత్ర శైవక్షేత్రమైన శ్రీముఖలింగం శిల్ప సంపదను కాపాడాలని ఆలయ అనువంశిక అర్చకుడు నాయుడుగారి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో శనివారం మాన్యుమెంట్ ఆథారిటీ చైర్మన్ కె.కె.బాషాను కలిసి వినతిపత్రం అందించారు. పురాతన శాసనాలు, కట్టడాలు,శిల్పాలు శిథిలమైపోతున్నాయని, వీటిని సంరక్షించి భావితరలాకు అందించాలని కోరారు. ప్రాచీన శిల్ప సంపద సంరక్షణకు చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ విన్నవించారు.

శక్తి యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు

బూర్జ: బాలికలకు తల్లిదండ్రులు ఆచార, సంప్రదాయాలు నేర్పించాలని, సన్మార్గంలో నడిచేలా అవగాహన కల్పించాలని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. శనివారం పెద్దపేట ఆర్ట్స్ సంస్థ ఆవరణలో సంకల్పం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నంబర్లు అత్యవసర పరిస్థితుల్లో ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. పలు చట్టాలను వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుష్మిత, శక్తి యాప్ టీం సభ్యులు, జూనియర్ కళాశాల విద్యార్థులు, సచివాలయ మహిళా ఉద్యోగులు, ఆర్ట్స్ సంస్థ మహిళలు పాల్గొన్నారు.

వరుస నాట్లతో ప్రయోజనం

సరుబుజ్జిలి: వరి నాట్లు వరుసక్రమంలో నాటడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ టీమ్ కొత్తూరు డివిజినల్ డీపీఎం ధనుంజయరావు తెలిపారు. రావివలస గ్రామంలో రైతులుతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరినాట్లు వరుసక్రమంలో వేసిన పొలంలో అంతర పంటలుగా పెసర, మినుము, నువ్వులు, గోంగూరను సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. రీజినల్ అధికారి హేమసుందరరావు, డివిజినల్ ఎంటీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కులను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి

హిరమండలం: ఎఫ్‌ఏ-1 పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈఓ రాంబాబు సూచించారు. మండలంలోని గొట్టలక్ష్మీపురం, లొకండ ప్రభుత్వ పాఠశాలలను శనివారం పరిశీలించారు. ఈ పరీక్షలు పూర్తయి వారం రోజులు అవుతున్న నేపథ్యంలో హెచ్‌ఎంలు శ్రద్ధతో మార్కులను ఆన్‌లైన్‌లో చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం ప్రత్యేక తరగతులతోపాటు సాయంత్రం స్టడీ హవర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్‌లను విధిగా ఉపయోగించాలన్నారు. విద్యార్థుల చేతిరాత మరింత మెరుగుపడేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పకుండా పాటించాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపు పొలాలకు..

శాశ్వత పరిష్కారమెప్పుడు?



నరసన్నపేట మండలం మామిడివలస వద్ద ముంపులో ఉన్న వరి పొలాలు

- భారీ వర్షాలకు పంట పొలాలు ముంపు
- ఏటా నష్టపోతున్న రైతులు
- నరసన్నపేట నియోజకవర్గంలో 3 వేల ఎకరాలకు పైగా ముంపు..
- కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్‌లో తంపర భూముల రైతులు ఏటా నష్టాలు చవిచూస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా లోతట్టు భూములు నీటి మునుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా ప్రభుత్వాలు శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కరించడం లేదు. దీంతో నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో లోతట్టు భూములు చాలా రోజులు వరదనీటోనే ఉంటున్నాయి. ఏ మాత్రం వర్షం అధికమైనా పొలాల్లో నీరు చేరుతుంది. రోజుల తరబడి బయటకు వెళ్లడం లేదు. దీంతో రైతులు నష్ట పోతున్నారు. కాలువల ఆక్రమణకు గురికావడం, ఎగువ నుంచి వస్తున్న నీరు కిందకు సజావుగా వెళ్లకుండా లోతట్టు భూముల్లో నిల్వ ఉంటుంది. ఈ విధంగా మండలంలో 3,500 ఎకరాల వరకు వరి పంట నీట మునుగుతుంది. వంశధార అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. నరసన్నపేట మండలంలోని కుద్దాం, బాలసీమ తదితర గ్రామాలకు ఆనుకొని ఉన్న నూకాలమ్మ ఛానల్‌ను ఆధునీకరిస్తే కొంత వరకు ముంపు సమస్య పరిష్కారం అవుతుందని రైతులు అంటున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

- నరసన్నపేట మండలంలో మామిడివలస, చిక్కాలవలస, కుద్దాం, కంబకాయ, నర్సింగపల్లి, బొరిగివలస, మడపాం, చింతువానిపేట, సుందరాపురం గ్రామాల్లో 580 ఎకరాల వరకు వరి పొలాలు నీట మునుగుతున్నాయి.
- జలుమూరు మండలంలో కూర్మనాథపురం, తాళ్లవలస, అచ్యుతాపురం, యలమంచిలి, గుగ్గిలి, గుండువలస, పాగోడు, కరవంజ, మర్రివలస, నగిరికటకం తదితర గ్రామాల్లో వరి పొలాలు ఏటా నీట మునుగి నష్టపోతున్నాయి.
- పోలాకి మండలంలో సుసరాం, డీఎల్ పురం ,అంప్లాం, గుప్పెడిపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, ప్రియాగ్రహారం గ్రామాల్లో అధిక వర్షాలకు పంటలు ఏటా పాడువుతున్నాయి.
- సారవకోట మండలంలో మాలువ, నవతల, గ్రామాల్లో ముంపు భయం రైతులకు వెంటాడుతోంది.



అధికారులకు ముంపు ఇబ్బందులను వివరిస్తున్న రైతులు



జంగిల్‌తో ఉన్న నూకాలమ్మ ఛానల్

శాశ్వత పరిష్కారం చూపాలి



మామిడివలస, కుద్దాం, చిక్కాలవలస, కంబకాయ తదితర గ్రామాల పరిధిలోని తంపర భూముల్లో ముంపు సమస్య ఉంది. ఏటా పొలాలు నీట మునగడం జరుగుతుంది. కిందకు నీరు వెళ్లే మార్గం సక్రమంగా లేదు. ఈ భూములతో లింకు ఉన్న నూకాలమ్మ ఛానల్‌లో పూడికతీత పనులు గత కొన్నేళ్ల నుంచి చేపట్టలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.లక్ష్మునాయుడు, మాజీ సర్పంచ్, చిక్కాలవలస, నరసన్నపేట మండలం

ప్రతి ఏటా నష్టపోతున్నాం



పోలాకి మండల పరిధిలోని సుసరాం గ్రామ తంపర భూములు ఏటా నీట మునగడంతో నష్ట పోతున్నాం. ఏటా ఖరీఫ్ సీజన్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారు.. వెళ్లున్నారు తప్ప పరిష్కారం ఉండటం లేదు. ఈ సమస్య పరిష్కరిస్తే వందలాది మంది రైతులకు మేలు జరుగుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటికే ఒకసారి పొంట పొలాలు వరద నీటిలో మునిగాయి. ప్రస్తుతం వరి పంట ప్రాథమిక దశలో ఉండడంతో నష్టం తక్కువగా ఉంది.

– బలగ జనార్దనరావు, సత్తరువుపేట, పోలాకి మండలం

పంచాయతీ కార్యాలయం కూల్చివేత



పాతపట్నం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని కూల్చివేసి అన్న క్యాంటీన్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం పంచాయతీ కార్యాలయానికి చుట్టూ టార్పిలిన్లు కప్పేసి స్లాబ్‌ను డ్రిల్లింగ్ చేసి కూల్చేశారు. ఈ భవనం కూల్చివేసిన చోట అన్న క్యాంటీన్ నిర్మాణం చేపడతామని పంచాయతీ ఈఓ రామచంద్రరావు తెలిపారు.

– పాతపట్నం

ప్రమాదకరంగా..



పాతపట్నం మండల కేంద్రంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల మూడు రోజులు కురిసిన వర్షాలకు ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని మెళియాపుట్టి, పలాస వెళ్లే రహదారి కోతకు గురైంది. ఈ రహదారి మీదుగా ఇందిరమ్మ కాలనీ, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మోడల్ స్కూల్, జగనన్న కాలనీ, కేజీబీవీతోపాటు టెక్కలి, మెళియాపుట్టి వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

– పాతపట్నం

కేజీబీవీ పరిశీలన



వంటకు వినియోగిస్తున్న బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పరిశుభ్రత పాటించాలని, చక్కగా చదువుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని ఆరా తీశారు. వంటకు వినియోగిస్తున్న బియ్యం, సరుకులను, వంటగది, మరుగుదొడ్లు, తరగతి గదులు, డార్మెటరీని పరిశీలించారు. డీటీ రాము, డిప్యూటీ ఎంపీడీఓ తారకేశ్వరి, ఏపీఎం త్రినాథమ్మ, హౌసింగ్ ఏఈ గణేష్, ఏపీఓ టి.రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, ఎస్ఓ రమ్య తదితరులు పాల్గొన్నారు.

'ఏకలవ్య' పరిసరాల్లో చెత్త కుప్పలు



పాఠశాల పరిసర ప్రాంతాల్లో వేసిన కూరగాయల చెత్త



పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారబోసిన మాంసం వ్యర్థాలు, చెత్త

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల పరిసర ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. జంతువుల కళేబరాలు, కూరగాయల చెత్త, కోడి మాంసం వ్యర్థాలు పాఠశాల ప్రహరీకి దగ్గరగా వేస్తున్నారు. విపరీతమైన దుర్గంధం, వెదజల్లుతూ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాహదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడెక్కడినుండో చెత్తను తెచ్చి గ్రామ శివార్లలో ఉన్న ఏకలవ్య పాఠశాల వద్ద వేస్తున్నారని స్థానికులు తెలిపారు. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలి పెట్టు



ఎల్.ఎన్.పేటలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమణ

హిరమండలం: నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలి పెట్టులాంటిదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ అన్నారు. శనివారం ఎల్.ఎన్.పేట మండలంలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బొర్రంపేట, శ్యామలాపురం, మల్లికార్జునాపురం, చింతలబడవంజ, దొంకలబడవంజ కరకవలస పాఠశాలలను సందర్శించారు. కరకవలసలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న మార్పులన్నీ బోధనా సమయాన్ని తగ్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మదింపు విధానంలో నూతనంగా తెచ్చిన అసెస్‌మెంట్ పుస్తకాల పేరిట మౌఖిక పరీక్షల్లో విద్యార్థి ప్రతి స్పందనల నమోదు కోసం ఉపాధ్యాయులు వందలాది పేజీలు రాయాల్సి ఉంటుందని, పరీక్షలు పూర్తయిన తరువాత పది రోజుల వరకు ఇవి రాయడానికే సమయం పడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే మూల్యాంకన పుస్తకాల్లో మార్పులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నూతనంగా భర్తీ చేయనున్న డీఎస్సీ పోస్టుల విషయంలో సెలక్షన్ లిస్టు ప్రకటించిన తరువాతే నియామకాలు చేపట్టాలన్నారు. డీఎస్సీ అభ్యర్థుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల నాయకులు పి.రామకృష్ణ, ఎ.వెంకట్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: సొంతంగా పని చేసుకోలేక, ఎటువంటి జీవనాధారం లేక.. ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పింఛన్లను అన్యాయంగా తొలగించి, వారిని రోడ్డున పడేయటం కూటమి ప్రభుత్వానికి తగదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో దాదాపు 450 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించారని, ఇందులో ఎంతోమందికి గత 20 ఏళ్లుగా పింఛన్లు పొందుతున్నారన్నారు. వారి పింఛన్లను అనర్హత పేరుతో సెప్టెంబర్ నుంచి ఆపేయడమంటే వారి జీవితాలను చిదిమేయడమేనన్నారు. పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు అందుకున్నవారు మరలా సంబంధిత ఎంపీడీఓలకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని, అప్పటికీ న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందించే సంక్షేమమని ప్రశ్నించారు. దివ్యాంగుల పొట్టకొట్టడం ఎంతవరకు సబబు అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కొప్పలి ఈశ్వరరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: సీఎం చంద్రబాబుకు పేదల సంక్షేమం పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను తొలగించి పీ4 అంటూ కొత్త నాటకం ఆడుతున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవాడికీ న్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమన్నారు. కేవలం చంద్రబాబు తన కుటుంబ సభ్యుల స్వలాభం కోసమే పాటుపడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారం విచ్చలివిడిగా సాగుతోందన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే ప్రజల సమస్యలను గాలికొదిలేసి దోపిడీకి తెరతీశారని ఆరోపించారు. కూటమి నాయకులు, ఎమ్మెల్యే అనుచరులు ఇసుక, మట్టిని విక్రయించి అక్రమంగా సంపాదిస్తున్నారని అన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

డీఎస్సీలో సత్తా చాటారు



అన్నెపు శేషాద్రినాయుడు

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన అన్నెపు శేషాద్రినాయుడు ప్రతిభ చూపాడు. ఎస్జీటీ విభాగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందాడు. తల్లిదండ్రులు ధర్మారావు, జగదాంబ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ఇంగ్లిష్‌లో జిల్లా టాపర్‌గా ..



మీసాల గోవిందరావు

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన మీసాల గోవిందరావు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ సబ్జెక్టులో జిల్లా టాపర్‌గా నిలిచారు. గోవిందరావుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తెలుగులో..

మెళియాపుట్టి: మండలంలోని మారడికోట గ్రామానికి చెందిన మజ్జి శైలజ తెలుగు స్కూల్ అసిస్టెంట్ పరీక్షల్లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించింది. భర్త ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు అభినందించారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక



రౌతు షణ్ముఖరావు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం గ్రామానికి చెందిన రౌతు షణ్ముఖరావు డీఎస్సీ-25 ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. టీజీటీ తెలుగులో జోన్ మొదటి ర్యాంకు, స్టేట్ 3వ ర్యాంకు, ఎస్‌ఏ తెలుగులో జిల్లా 3వ ర్యాంకు, పీజీటీ తెలుగు జోన్ 12వ ర్యాంకు, స్టేట్ 25వ ర్యాంకు సాధించాడు. షణ్ముఖరావు 2011 సంవత్సంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చేరి 2020లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అనంతరం యూజీసీ నెట్‌లో టాప్ ర్యాంకు సాధించి, ఆంధ్ర యూనివర్సిటీలో తెలుగులో పీహెచ్‌డీ చేశాడు. తండ్రి వైకుంఠరావు రైతు, తల్లి పార్వతమ్మ గృహిణి.

ఎరువులు అందజేయాలని వినతి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: ఖరీఫ్ ప్రారంభమై నెలలు కావస్తున్నా.. రైతులకు అవసరమైన ఎరువులు అందలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ పాపారావుకు శనివారం వినతిపత్రం అందించారు. రైతులకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలం అయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మునుపెన్నడూ ఇలా జరగలేదన్నారు. ఇప్పటికైనా అన్నదాతలకు ఎరువులు అందించాలని కోరారు. ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు నాసిరకమైన ఎరువులు కొనుక్కోవాల్సిన పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారని, సీజన్ దాటితే పంపిణీ చేసినా ఫలితం లేదన్నారు. వసుంధర ఎంపీటీసీ సలాన చిట్టి, సుందరాడ సర్పంచ్ సవర ధర్మారావు, పరపటి యోగీశ్వరరావు, సవర భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'మోసం చంద్రబాబు నైజం'



క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నేరవేర్చకుండా ప్రజలందరినీ మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఆకులతంపరలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను అందించారు. పార్టీ నాయకుడు చల్ల రవికిరణ్, సర్పంచ్‌లు సక్క వెంకటరావు, ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు వనుము లక్ష్మీనారాయణ, అగతమూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ దుర్గాప్రసాద్

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయం సాగులో భాగంగా రైతు తనకున్న పొలంలో పది సెంట్లలో కూరగాయల పంటలు సాగుచేసుకుంటే లాభదాయంకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గా ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని తామర గ్రామంలో గీత అనే రైతుతో వరిలో ఏటీఎం (అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్) మోడల్‌లో పంటలు వేయించి, ఏటీఎం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. వరి పంటలో కూడా పది సెంట్లు కేటాయించి వివిధ రకాలు కూరగాయలు, ఆకు కూరలను సాగు చేయాలన్నారు. తామర, తీమర, సీది గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

ఆమదాలవలస: ఈ నెల 25వ తేదీన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పెన్షనర్ల వ్యతిరేక విధానాలపై ఆందోళన చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానం ప్రకారం 12వ పీఆర్సీని వెంటనే నియమించి అమలు చేయాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, కమ్యూటేషన్ 15 సంవత్సరాల వ్యవధిని 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. 10వ పీఆర్సీ ప్రకారం క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. పెన్షనర్లందరూ పాల్గొనాలి పిలుపునిచ్చారు.